# గొలుసుకట్టు చెరువుల గోస-2

-హైటెక్ మండలంలో అంతమౌతున్న అతిపెద్ద గోదావరి జలవనరులు

-గంగారం చెరువునూ చెరబట్టిన అన'కొండ'

-సీలింగ్ భూములే కాదు.. చెరువులనూ వదలని వైనం

-నిద్ర నటిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు

-అక్రమ అనుమతులిస్తూ అంటకాగుతున్న జిహెచ్ఎంసి

-ఈర్ల చెరువును బలిచేసిన ఏసిపిది ఇక్కడా అదేతంతు



సుందరీకరణకోసం నీరు వదలకపోవడంతో చెరువులోనే మట్టిపోసి ఇండ్లు నిర్మించిన దృశ్యం

సైబరాబాద్ ప్రతినిధి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త

హైటెక్‌సిటీ ఏర్పాటుతో సైబరాబాద్‌గా పేరుగాంచిన శేరిలింగంపల్లి మండలానికి మరో విశిష్టత కూడా ఉంది... ఇక్కడున్న ప్రత్యేక భూభౌతిక పరిస్థితుల కారణంగా ఈ మండలంలోని కొంతభాగం కృష్ణా నదికి పరివాహకమయితే మరికొంత భాగం గోదావరి నదికి పరివాహక ప్రాంతమవుతోంది... హైటెక్‌సిటీ ఎదురుగావున్న తమ్మిడికుంట నుంచి మొదలయ్యే గొలుసుకట్టు చెరువుల్లోని నీరు తూర్పు వైపు ప్రవహిస్తూ మూసీనదిలో కలిసి కృష్ణానదికి చేరుతుండగా మియాపూర్ మీదికుంట నుంచి మొదలయ్యే గొలుసుకట్టు చెరువుల్లోని నీరు పడమటికి ప్రవహిస్తూ నక్కవాగు ద్వారా మంజీరనదిలో కలిసి గోదావరికి చేరుతోంది... శేరిలింగంపల్లిలో గోదావరి పరివాహక జలవనరులైన మీది కుంట, కాయిదమ్మకుంట, పటేల్ చెరువులోని నీటితోపాటు మరోవైపు నుంచి మంగళికుంట, ఈర్లచెరువులో నుంచి వెలువడే నీరు మొత్తం గంగారం పెద్ద చెరువులోకే చేరుతుంది...ఇక్కడి పరిసర ప్రాంతాల భూగర్భ జలాలను స్థిరీకరిస్తున్న ఈచెరువు మిగులు జలాలు పటాన్‌చెరు మీదుగా మంజీరనదికి చేరి చివరకు గోదావరిలో కలుస్తాయి... ఇంతటి విశిష్టతను కలిగి శేరిలింగంపల్లిలో దుర్గంచెరువు తర్వాత రెండవ అతిపెద్ద చెరువుగా పేరుగాంచిన గంగారం చెరువు చుట్టూ చేరిన గద్దలు గత రెండు దశాబ్దాలుగా అమూల్యమైన జలవనరును అంతం చేస్తున్న వైనంపై ప్రభాతవార్త ప్రత్యేక కథనం...

శేరిలింగంపల్లి మండలం గంగారం గ్రామం 5నుంచి 12వరకు ఉన్న సర్వేనెంబర్లతోపాటు 283-299వరకు, 304-307వరకు ఉన్న సర్వేనెంబర్లలో మొత్తం 112ఎకరాల ఒక గుంట మేర గంగారం పెద్దచెరువు విస్తరించివుంది. హైదరాబాద్ ముంబయి జాతీయ రహదారిని ఆనుకొనేవున్న ఈ చెరువు గత రెండు దశాబ్దాలుగా కబ్జాదారుల చేతిలో చిక్కి క్రమక్రమంగా కనుమరుగవుతోంది. గతంలో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ చెరువుకు పడమటివైపు లేక్‌వ్యూ నిర్మాణాలంటూ చెరువు కబ్జాకు యత్నించగా వార్త దినపత్రిక వరుస కథనాలతో వెనక్కి తగ్గింది. అంతకుముందు ఓ మాజీ ఐఎఎస్ అధికారి చెరువులో తన పట్టాభూమి ఉందంటూ రాత్రికి రాత్రి వందలాది టిప్పర్ల మట్టిని చెరువులోకి డంప్‌చేశాడు. ఈవిషయమై అప్పట్లో వార్త దినపత్రికలో వెలువడిన కథనాలకు స్పందనగా ఆయనపై అప్పటి తహసిల్దార్ క్రిమినల్ కేసులు నమోదు చేయించారు. ఇక చెరువుకు ఉత్తరం వైపు మరో లేఅవుట్ పేరిట అడపాదడపా అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తున్నాయి. ఇరిగేషన్ అధికారులు జేబులు నింపుకొని నిద్ర నటిస్తుండడంతో వారి నిరభ్యంతర పత్రాలు లేకుండానే జిహెచ్ఎంసి అధికారులు ఇష్టానుసారం చెరువు శిఖం స్థలంలో అనుమతులు మంజూరు చేస్తున్నారు. వీరి అనుమతులను ఆధారంగా చేసుకొని అక్రమార్కులు కోర్టుల్లో స్టేటస్‌కోలు మంజూరు చేయించుకొని మరీ నిరాటంకంగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. నకిలీ ఎల్ఆర్ఎస్‌లు, ఇరిగేషన్ శాఖ ఎన్‌ఓసిలు కూడా సృష్టించి అనుమతులు పొందిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. ఇక తూర్పు వైపు రెండు దశాబ్దాల క్రితమే అతిపెద్ద అపార్ట్‌మెంట్లు పుట్టుకురాగా జాతీయరహదారి పక్కనేవున్న దక్షిణంవైపు కూడా అడపాదడపా నిరాటంకంగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

**అన'కొండ'కు అండగా ఏసిపి**

ఈర్ల చెరువులోని బఫర్‌జోన్‌లో భవన నిర్మాణాలకు అనుమతులిచ్చి పోలీసు కేసులు ఎదుర్కొంటున్న జిహెచ్ఎంసి చందానగర్ సర్కిల్ ఏసిపి రాజ్‌కుమార్ గంగారం చెరువులోని బఫర్‌జోన్‌లో సైతం కెఎస్ఆర్ లేఅవుట్ పేరిట ప్లాట్‌నెంబరు 630లో రెండు జంట భవనాలకు అనుమతులిచ్చాడు. దీంతో ఇక్కడ అత్యంత వేగంగా ఇండ్ల నిర్మాణం పూర్తిచేసిన ఆక్రమణదారులు రెండు భవనాలను విక్రయానికి పెట్టారని సమాచారం. శేరిలింగంపల్లి అన'కొండ'గా పేరుగాంచిన ఓవ్యక్తి ఇరిగేషన్ ఎన్‌ఓసి లేకుండానే ఏసిపిని ఏమార్చి అడ్డదారుల్లో ఈభవనాలకు అనుమతులు ఇప్పించాడు. ఇతను గతంలో సైతం ఇదే లేఅవుట్‌లో పలు నిర్మాణాలకు అక్రమంగా అనుమతులు ఇప్పించాడు. సుందరీకరణ కోసమంటూ గతకొన్ని సంవత్సరాలుగా గంగారం చెరువులోకి నీరు వదలకపోవడాన్ని తనకు అనుకూలంగా మార్చుకొని ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ స్థలాలను స్వాహాచేస్తున్నాడు. దీంతోపాటే చందానగర్ బచ్చుకుంట పక్కనేవున్న శ్యామ్‌లాల్ లేఅవుట్‌లో సైతం నకిలీ ఎల్ఆర్ఎస్‌లు, ఇరిగేషన్ ఎన్‌ఓసిలతో అక్రమ నిర్మాణాలకు అనుమతులు తెచ్చాడని సమాచారం. కొండాపూర్ రాఘవేంద్రకాలనీ, రాజరాజేశ్వరి నగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లోని సీలింగ్ భూముల్లో వందలాది నకిలీ యూఎల్‌సి సర్టిఫికెట్లు, నకిలీ ఎల్ఆర్ఎస్ సర్టిఫికెట్లతో అనుమతులు ఇప్పించి కోట్లు గడించడం ద్వారా 'బంగారు'బాబుగా పేరుగాంచిన ఈ అన'కొండ' చివరకు చెరువులను సైతం వదలడంలేదు.

ఇప్పటికైనా హైడ్రా అధికారులు ఈ వ్యవహారాలపై పూర్తి విచారణ జరిపించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




ఆరేళ్ల క్రితం నిండా నీటితో కళకళలాడిన గంగారం చెరువు (ఉపగ్రహచిత్రం)



చెరువులోకి నీరు వదలకపోవడంతో వట్టిపోయిన

# హైదరాబాద్ వార్త



## వర్షాలతో నగరం అస్తవ్యస్తం..

-విరిగిన చెట్లు ..నేలకొరిగిన విద్యుత్ స్థంభాలు

-గంటలకొద్ది మరమ్మతులు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

-ప్రధాన రహదారులు, కాలనీల్లో దెబ్బతిన్నరోడ్లు







**హైదరాబాద్, సెప్టెంబరు 2,ప్రభాతవార్త:** రాష్ట్రరాజధాని హైదరాబాద్‌లో ఏకదాటిగా వర్షం కురవడంతో పలు ప్రాంతాలు జలమయ్యాయి. రోడ్లపై మోకాలి లోతు నీరు నిలిచింది. వాహనదారులు ,పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీల్లో డ్రైనేజీ పొంగిపొర్లింది. అలాగే కొన్ని ప్రాంతాల్లో అత్యధికంగా చెట్లకొమ్మలు ఇరిగి కరెంట్‌స్తంభాలపై పడటంతో గంటలకొద్ది విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. హైదరాబాద్ నగర శివారు ప్రాంతంలోని శంకర్‌పల్లి మండలం పరిధిలోని లాఫలోమా గేటెడ్ కమ్యూనిటీలోని విల్లాలు నీట మునిగాయి. గేటెడ్ కమ్యూనిటీలోని రహదారులన్నీ చెరువులను తలపించాయి. విల్లాల ముందు పార్కు చేసిన కార్లు ,బైకులు వరదనీటిలో తేలియాడుతున్నాయి. లాఫలోమా గేటెడ్ కమ్యూనిటీలో దాదాపు 200లకుపైగా విల్లాలు ఉండగా ..దాదాపు వెయ్యిమంది నివసిస్తున్నారు. ఒక్కోవిల్లా విలువ ఎంత లేదన్నా2 నుంచి 3కోట్ల రూపాయల దాకా ఉంటుంది. అంతపెట్టి కొనుగోలు చేసినప్పటికీ యజమానులకు బాధలు తప్పడం లేదు. వర్షం పడితే ప్రతిసారి తమవిల్లాలు ముందు స్విమ్మింగ్ పూల్స్ దర్శనమిస్తున్నాయని కమ్యూనిటీ వాసులు వాపోతున్నారు. అలాగే కూకట్‌పల్లి, బోరబండ ప్రాంతంలో పలు కాలనీల్లో వరదనీటిలోనే ఉన్నాయి. అలాగే నిజాంపేట్ జైదీపికా ఎస్టేట్‌లో సెల్లార్‌లోకి వరదనీరు పోటెత్తింది. బోరబండ, అల్లాపూర్, యూసుఫ్ నగర్‌లోని కాలనీల్లో మోకాళ్లలోతు వరకు నీరు చేరింది.

**చిన్నవానొచ్చినా ...డ్రైనేజీలు పొంగుతున్నాయి**

సిటీలో చిన్నవాన పడినా మ్యాన్‌హోల్స్ ,డ్రైనేజీలు, నాలాలు పొంగిపొర్లుతున్నాయి. మురుగునీరు రోడ్లపైకి చేరి నిలిచిపోతుండటంగా వాహనదారులు , స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గతరెండు రోజులు కురిసిన వర్షానికి బస్తీలు, కాలనీల్లోని మ్యాన్‌హోల్స్ పొంది పొర్లి మురుగంతా రోడ్ల పైనే నిలిచిపోయింది. ముఖ్యంగా రద్దీ రూట్లలో డ్రైనేజీ ఓవర్ ఫ్లోసమస్య తీవ్రంగా ఉంది. మరోవైపు ఇండ్లలోని వ్యర్థాలన్నీ రోడ్లపైకి చేరితీవ్ర తీవ్ర దుర్గంధం కలిగిస్తున్నాయి. ప్రతిడివిజన్‌లోనూ స్థానికుల నుంచి కంప్లైయింట్స్ కూడా పెరిగాయి.

**సమన్వయంతో పనిచేస్తున్నాం : మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ**

గతమూడు రోజులుగా నగరంలో కురుస్తునన వర్షాలకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల సమన్వయంతో జిహెచ్ఎంసి యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ తీసుకోవాల్సి న అన్నిచర్యలు తీసుకుంటామని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ తెలిపారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సోమవారం ఆకస్మికంగా సందర్శించి ,ఓఎస్‌డి అనురాధతో ఇప్పటివరకు నగరంలో పడిన వర్షపాతం , అత్యధిక వర్షాపాతం నమోదైన ప్రాంతాలు, వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించినవి ,హుస్సేన్‌సాగర్ ,హిమాయత్ సాగర్ ,ఉస్మాన్‌సాగర్‌ల నీటిమట్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ వాతావరణశాఖ రెడ్‌అలర్ట్ ప్రకటించిన నేఫథ్యంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా జిహెచ్ఎంసి కమిషనర్ మొదలు అన్నిస్థాయిల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవసరమైన చర్యలు చేపట్టార ని తెలిపారు. స్టాటిస్టిక్స్ ఎమర్జెన్సీ టీంలు, డిఆర్ఎఫ్ టీంలు సంయుక్తంగా పనిచేస్తున్నాయన్నారు. 141లోకేషన్‌లలో 242 ఎమర్జెన్సీ బృందాలు, 157 మెబైల్ టీమ్స్, 40డిఆర్ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ 7 ఎమర్జెన్సీ టీంలు, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లకు నాలుగు చొప్పన అదనపు ఎమర్జెన్సీ టీంలను కేటాయించినట్లు తెలిపారు. జిహెచ్ఎంసి కంట్రోల్ రూం 12మంది బృందం ,డిఆర్ఎఫ్ కంట్రోల్ రూమ్‌లో 10మంది బృందం 24/7గంటలు పనిచేస్తున్నారన్నారు. జిల్లాలో అత్యదిక వర్షాపాతం 9సెంటీమీటర్లు కురిసిందని, వర్షంతో వాటర్ స్టాగ్నేషన్ కన్నా ఎక్కువగా చెట్లు పడిపోయాయని ..వాటిని ఎప్పటికప్పుడు తొలగించడం జరిగిందని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు. ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా జిహెచ్ఎంసి అనుబంధ శాఖలు పనిచేస్తున్నాయని వివరించారు.

## చెరువులు, నాలాల ఆక్రమణలపై హైడ్రా క్షేత్రస్థాయిలో పర్యటన



హైడ్రా అధికారులకు నాలా వివరాలు తెలియజేస్తున్న ఏఈ సారా

**దుండిగల్, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** దుండిగల్, బాచుపల్లి మండల పరిధిలో హైడ్రా విభాగం ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువులు, నాలాల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించడం జరిగింది. మల్లంపేట ఖత్వ చెరువుకు జిన్నారం మండలం నుండి వచ్చే ప్రధానమైన నాలాను ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేయడంపై ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకున్న మళ్ళీ నాలాను కూల్చివేయడంపై భాజపా నాయకుల ఫిర్యాదు మేరకు ఇరిగేషన్, హైడ్రా అధికారులు సంయుక్తంగా సందర్శించారు. జిన్నారం, దుండిగల్ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించి నాలాకు పునరుద్ధరించి పూర్వవైభవం తీసువచ్చే చర్యలు చేపడుతామన్నారు. ఖత్వ చెరువులో ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్లో లక్ష్మీశ్రీనివాస కన్స్ట్రక్షన్స్ అక్రమంగా నిర్మించిన విల్లాలు, భౌరంపేట సర్వేనంబర్ 166 నుండి వచ్చే నేరేళ్ళ వాగు ఇసుక దిబ్బల వద్ద ఆక్రమణలు, అక్రమ నిర్మాణం పరిశీలంచారు. నేరేళ్ల వాగు ఐదు కిలోమీటర్లు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. బాచుపల్లిలోని కోమటికుంట ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్లో వాసవి కన్స్ట్రక్షన్స్ చేపట్టిన 8,9 బ్లాక్‌లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎల్లమ్మకుంట చెరువు మత్తడి ఆక్రమణలపై చర్యలు చేపట్టనున్నట్లు అధికారుల బృందం పేర్కొన్నారు. కార్యక్రమంలో హైడ్రా విభాగం అధికారులు, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ సారా, భాజపా నాయకులు ఆకుల సతీష్, ఎంబరి ఆంజనేయులు, పీసరి కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అరుణ్‌రావు, ఎల్లస్వామి, శ్రీనివాస్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలను పరిష్కరిస్తాం : డిసి

**అత్తాపూర్ సెప్టెంబరు2,ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కారించాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవి కుమార్ పేర్కొన్నారు.సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో వివిధ ప్రాంతాల ప్రజల ద్వారా స్వీకరించిర ప్రజాసమస్యలను త్వరగా పరిష్కారం చేస్తున్నట్లు డిసి తెలిపారు.ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.సర్కిల్ పరిధిలోని ఎవైనా సమస్యలు ఉంటే ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేయాలని వాటి పరిష్కారానికి చొరవచూపుతామని అన్నారు.

## ప్రత్యేక అధికారులు ప్రతినెలా పాఠశాలలు సందర్శించాలి

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్, సెప్టెంబరు 2,ప్రభాతవార్త:** ప్రత్యేక అధికారులు ప్రతినెలా పదిపాఠశాలలను సందర్శించి రిజిస్టర్లను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో డిఈవో, ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక అధికారులు పాఠశాలలను సందర్శించిన వివరాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలను సందర్శించి నివేదికలు సమర్పించుటకు నియమించబడిన ప్రత్యేక అధికారులు ప్రతివారం రెండు, నెలలో పది పాఠశాలలను సందర్శించి తప్పనిసరిగా పాఠశాలల్లోని అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రిజిస్టర్ అప్డేట్, ఎంఎన్‌వోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు అందులో సంతకం చేశారా లేదా అని పరిశీలించాలని అన్నారు. అలాగే అమ్మ పాఠశాలల నాణ్యతను పరిశీలించాలని ఎఫ్ఎల్ఎన్‌ను చూడాలని అన్నారు. ప్రతి పాఠశాలల్లో విద్యార్థులు అనర్గళంగా చదవగలుగుతున్నారనా లేదా అని పరిశీలించాలని ,పాఠశాలల్లో టీచర్ల కొరతను గమనించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్, పి.వెంకటాచారి, లా ఆఫీసర్ వీరబ్రహ్మాచారి, జిల్లా అధికారులు పెరిక యాదయ్య, ఆర్ కోటజీ, రోహిణి, పవన్‌కుమార్, సిపివో డాక్టర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌గా సౌజన్య

**నిజాంపేట్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌గా దేవులపల్లి సౌజన్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసేందుకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలను అధికారులను అందరు సమిష్టిగా కృషి చేస్తే అభివృద్ధి దిశగా ముందుకెళ్తామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకుంటూ దీర్ఘకాలికంగా పేరుకుపోతున్న పలు సమస్యలను ఆయా శాఖల అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## ఘాన్సీబజార్ డివిజన్‌లో అధ్వాన్నస్థితిలో రహదారులు



ఘాన్సీ బజార్ డివిజన్‌లో గుంతలమయంగా రహదారులు

**చార్మినార్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని రహదారులు చాలా అధ్వాన్నస్థితిలో ఉన్నాయి.రోడ్లు గుంతలు మయంగా మారినప్పటికి పట్టించుకునే నాధుడే కరువయ్యాడు.వస్త్రాల వ్యాపారానికి ప్రసిద్ధి గాంచిన ఘాన్సీ జార్ డివిజన్‌లో వందలాది బట్టల షాపులు ఉన్నాయి.నిత్యం కొనుగోలుదారులతో వస్త్రాల మార్కెట్లు కళకళ లాడుతుంటాయి.కాగా రహదారులు అధ్వాన్నస్థితికి చేరుకున్నప్పటికి గత్యంతరం లేక ప్రజలు గుంతలలో ప్రయాణం చేస్తున్నారు.చెడిపోయిన రహదారులపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయపడుతున్నారు.ఘాన్సీ బజార్‌లోని తాహెల్ జెవెల్లర్స్ రహదారిలో రెండు నెలలు క్రితం వాటర్ వర్క్స్ పనులు కోసం రహదారిని తవ్వారు.పనులు పూర్తియిన తర్వాత గుంతలను పూడ్చకుండ వదిలి వేశారు.కాగా వాటర్ వర్క్స్ పనులు జరిగిన రహదారిలో కొత్త రహదారి నిర్మాణం కోసం మట్టిని తవ్వి రోడ్డు మధ్యలో విడిచి పెట్టారు.రహదారి మధ్యలో మట్టి కుప్పలు ఉన్నందున వాహనాల రాకపోలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.గణేష్ నవరాత్రి ఉత్సవాలు మరో ఆరు రోజులలో ప్రారంభం కానున్నందున గణేష్ మండపాల విగ్రహాలను ఎలా తీసుకెళ్లాలని ఆంధోళన చెందుతున్నారు. ఘాన్సీ బజార్ వైధిక వచనాలయం నుంచి హైకోర్టుకు వెళ్లె రోడ్డు గుంతలు మయంగా మారింది.ఈ రోడ్డుపై నడచి వెళ్లటానికి ప్రజలు వెనుకంజు వేస్తున్నారు. ఘాన్సీ బజార్ నుంచి ఝూలాకు చేరుకునే రోడ్డు చెడిపోయి శిధిలావస్థకు చేరుకుంది.స్థానిక శ్రీ రాణి సతీ దాది మందిరం వద్ద రహదారిలో గుంతలు ఉండటంతో వాహనదారులు గుంతలలో జారిపడి గాయాల పాలవుతున్నారు.మూసాబౌలి నుంచి సిటీ కళాశాల వైపు వెళ్లె దయాగ్నోస్టిక్ సెంటర్లకు ఎదురుగా ఉన్న బస్టాప్ వద్ద రహదారి పూర్తిగా చెడి పోయింది.ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని కోకరివాడి, షక్కర్‌కోట, ఉర్దూగల్లీ, ఝూలా ప్రాంతాలలోని రహదారులు చాలా అధ్వాన్నస్థితిలో ఉన్నాయి.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఘాన్సీ బజార్ డివిజన్‌లో చెడిపోయిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## హిమాయత్ సాగర్ జలాశయంను సందర్శించిన కలెక్టర్ శశాంక



హిమాయత్ సాగర్ జలాశయంలోని నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక దృశ్యం

**నార్సింగి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :** హిమాయత్ సాగర్ జలాశయంను సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక సందర్శించారు. జల మండలి అధికారులతో మాట్లాడి పూర్తిస్థాయి నీటి మట్టం ఎంత? ఇప్పుడెంత ఉంది? పై నుంచి వాగుల ద్వారా ఎంత మేర వరద నీరు వస్తుంది? వంటి వివరాలను తెలుసుకున్నారు. చెరువు కట్టపై నిలబడి జలాశయంలోని నీటిని, అలాగే గేట్లను పరిశీలించారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వరద ఉధృతి ఎక్కువగా వచ్చి జలాశయం నిండితే గేట్లు విప్పేందుకు అన్ని ఏర్పాట్లు చేసి ఉంచుకోండని ఆదేశించారు. అలాగే ఈసీ వాగు పరిసర ప్రాంత ప్రజలను, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు 5.ఫీట్ల కొత్త నీరు వచ్చి చేరిందని, ఇప్పుడు 1760.ఫీట్లకు చేరుకుందని, మరొక్క భారీ వర్షం కురిసినా హిమాయత్ సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టంకు చేరుకుంటుందని జల మండలి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కొత్తనీరు వచ్చి చేరడం పట్ల కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. కృష్ణా, గోదావరి నదులలో నీటి మట్టం తగ్గడం వలన వేసవి నుంచి జంట జలాశయాల నుంచే హైదరాబాద్ ప్రజలకు మంచినీటిని సరఫరా చేయడం జరుగుతుందని, ఈ జలాశయాలు నిండితే రాజధానికి నీటి కొరత ఉండదని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, జల మండలి జిఎం, డిజిఎంలు ఉన్నారు.

## కమిషనర్ సౌజన్యను కలిసిన బిజెపి శ్రేణులు



వినతిపత్రం అందజేస్తున్న భాజపా నేతలు

**నిజాంపేట్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ సౌజన్యని సోమవారం బిజెపి శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత వర్షం వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అదేవిధంగా రాబోయే గణేష్ ఉత్సవాలకు సంబంధించి భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిక్షపతి యాదవ్, నరేంద్ర చౌదరి, ప్రసాద్‌రాజు, సుమన్‌రావు, దాసి నాగరాజు, రవి యాదవ్, సచిన్, శ్రీనివాస్‌గుప్తా, ఉదయ్ కిరణ్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఉజ్జయినీ మహాకాళి ఆలయంలో రుద్రహోమం



శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో రుద్రహోమం.

**బేగంపేట సెప్టెంబరు 2,ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు. ఈహోమంలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో అమ్మ వారి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రుద్రహోమం జరుగుతున్న దృష్ట్యా ఆలయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కార్యనిర్వహణాధికారి, ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేసారు. ఈ హోమం కార్యక్రమంలో ఈ ఓ మనోహర్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

## విద్యుత్ పునరుద్దరణ పనులు పర్యవేక్షించిన కార్పొరేటర్



విద్యుత్ మరమత్తులు పరిశీలిస్తున్న శాంతి శ్రీనివాస్ రెడ్డి

**అల్వాల్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** భారీ వర్షాలు నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం వరద ప్రభావిత ప్రాంతాలులో విద్యుత్ సమస్యలు తలెత్తడం జరిగింది. విద్యుత్ పునరుద్దరణ చర్యలులో బాగంగా లోతుకుంట, కమ్మబస్తి, బిహెచ్ఇఎల్ కాలనీ, ప్రశాంత్ నగర్, రామ్‌నగర్, కిష్టమ్మ ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాలులో కార్పొరేటర్ పర్యటించారు. ఆదివారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగుతున్నాయని తెలిపారు. చెట్లు విద్యుత్ లైన్లుపై పడడంతో సమస్య తీవ్రంగా మారిందని పేర్కొన్నారు.

## భారీవర్షాలకు ప్రజలు జరభద్రం : జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త**

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శేరిలింగంపల్లి నియోజక వర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ సూచించారు. అవసరం ఉంటేనే తప్ప ఇంటిబయటకు వెళ్లకుండ జాగ్రత్తవహించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల నాలుగురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని లోతట్టు ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ..భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోనే ఉండాలని బయటకురావద్దని జీహెచ్ఎంసీ అధికారులు, పోలీస్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది తగు చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. వర్షంలో తడిచిన విద్యుత్ స్థంబాలు,తడిచేతులతో స్టార్టర్లు, మోటార్లు,స్విచ్‌బోర్డులు ముట్టుకోవద్దన్నారు. విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్లను కూడా ముట్టుకోవద్దన్నారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువులకు దూరంగా ఉండాలన్నారు. ఇంట్లో ఇనుపతీగలపై దుస్తులను ఆరబెట్టవద్దన్నారు. ఉరుములు, మెరుపుల సమయంలో డిష్‌వైర్‌ను టీవీల నుంచి తీసివేయటమే మంచిదన్నారు. రోడ్లపై నీరు నిలిచినప్పుడు మ్యాన్‌హోల్స్ ఉన్నాయో లేదో చూసుకుని వెళ్లాలన్నారు వరద భారీగా చేరుప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ చేయకూడదని విజ్ఞప్తి చేశారు.

## సొంత నిధులతో పురోహితులకు ఆర్థిక సహాయం

### -ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



సొంత నిధులతో పురోహితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త**

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధ్యాత్మిక సేవలు ముందుంటున్నారు. తన సొంత నిధులతో ప్రతి నెల దేవాలయాల్లో పనిచేస్తున్న పురోహితులకు ఆర్థిక సహాయం అందిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సోమవారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తన స్వంత నిధులతో 14 మంది పురోహితులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత నిధులతో అధ్యాత్మిక భక్తిభావంతో పాటు సామాజిక సేవలకు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభగల విద్యార్థుల చదువులకు, పేదకుటుంబాల్లో వివాహలకు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారితోపాటు పేదల్లో స్వర్గస్థులైనవారికోసం స్మశా నవాటిక నిర్వాహకులకు ఆర్థిక సహాయం అందిస్తున్నానని తెలిపారు.

**గుండెపోటుతో జిహెచ్ఎంసి రిటైర్డ్ అధికారి సురేశ్ చంద్రారెడ్డి మృతి**

**అడ్డగుట్ట, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఏసిపిగా పనిచేసిన రాళ్ల సురేశ్ చంద్రారెడ్డి (67) గుండెపోటుతో గత నెల 31న కొత్తగూడెంలో మృతి చెందాడు. సికింద్రాబాద్ ఈస్ట్ మారేడ్‌పల్లిలో నివాసం ఉంటున్న సురేశ్ చంద్రారెడ్డి గత నెల 30న కొత్తగూడెంలోని తన బంధువుల ఇంటికి వెళ్ళారు. మరుసటి రోజు 31 శనివారం ఉదయం గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఆయనకు భార్య శ్రీలత, కూతురు శ్రీవాని, కుమారుడు నరేశ్ రెడ్డిలు ఉన్నారు. అయితే కూతురు శ్రీవాని విదేశాల నుంచి రావడంతో సోమవారం మేడ్చెల్ మల్కాగిరి జిల్లాలోని మూడు చింతలపల్లిలోని సురేశ్ చంద్రారెడ్డి ఫామ్ హౌజ్‌లో అంత్యక్రియలు జరిగాయి. ఆయన మృతి చెందడంతో సికింద్రాబాద్, మారేడ్‌పల్లి, అడ్డగుట్ట, జిహెచ్ఎంసి నార్త్‌జోన్ కార్యాలయాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలపై సమావేశం

### -జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న

**చార్మినార్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతనగరంలో శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. సెప్టెంబరు నెల ఏడవ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా సోమవారం పాతబస్తీ చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, పలుప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పాతబస్తీలోని పలు ప్రాంతాలలో నెలకొని ఉన్న సమస్యలపై గణేస్ ఉత్సవ సమితి ప్రతినిధులు, మండపాల నిర్వాహకులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న మాట్లాడుతూ వినాయక మండపాలు ఏర్పాటు చేసిన ప్రాంతాలలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. పాతనగరంలోని ప్రధాన మార్గాలలో రహదారులపైకి ఉన్న చెట్లు కొమ్మలను తొలగిస్తున్నామని, రహదారులకు మరమ్మతులు, వీధి దీపాలు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండ అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన తెలియజేశారు. హైదరాబాద్ పాతనగరంలో శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా గణేష్ శోభా యాత్రలు కొనసాగే ప్రధాన రహదారులలో ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సవవేశంలో మలక్‌పేట్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు బియంత్, సురేందర్, సరిత, అరుణ కుమారి, రవి కుమార్, వెటర్నరీ డిడి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూబిడి డిడి అమీనాబీ, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కొడి మహేందర్, నిరంజన్ యాదవ్, మహేశ్వర్, ఉమామహేంద్ర, శ్రీ నాధ్, శ్రీ కాంత్ రెడ్డి, మల్లేష్ యాదవ్, రాజేశ్వర్, ఉమేష్ సింగానియా, విజయ్ కుమార్ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న, డిఎంసిలు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు

## పాతబస్తీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

**చార్మినార్, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావటానికి మరో ఆరు రోజులు ఉండటంతో మండపాల నిర్వాహకులు పెద్ద ఎత్తున గణేష్ విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. సెప్టెంబరు నెల ఏడవ తేదీన శ్రీ వినాయక చవితి పండుగను ప్రజలు అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకోన్నారు. వినాయక చవితి పండుగ దగ్గర పడుతుండటంతో ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు ధూల్‌పేట్, షెహనాత్‌గంజ్, పార్ధివాడతో పాటు పలు ప్రాంతాలు నుంచి వాహనాలలో విగ్రహాలను మండపాల వద్దకు తీసుకెళ్తున్నారు. పాతబస్తీలోని చార్మినార్, ఘాన్సీ బజార్, కోకరివాడి, పురానాపూల్, దూద్‌బౌలి, లాల్‌దర్వాజ, ఛత్రినాక, గౌలిపుర, ఉప్పుగూడ, అలియాబాద్ ప్రాంతాలలో భారీ గణనాధులను ప్రతిష్టంచనున్నారు. నిర్వాహకులు గణేష్ మండపాలను సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. పాతబస్తీ పురానాపూల్ డివిజన్ పరిధిలోని గల్బవీధిలో గల్బవీధి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని నిర్వాహకులు సందీప్ గౌడ్ తెలిపారు. గల్బవీధిలో గత నలభై నాలుగు సంవత్సరాలు నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలను వైశంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వైభవంగా గణేష్ నవరాత్రి జరపటానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### -గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్



వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, సెప్టెంబరు 2ప్రభాతవార్త:** భారీగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ కోరారు. బస్తీల్లో ఇళ్ళురోడ్లపై నిలిచిఉన్న వరదనీరు కారణంగా ప్రజలు అనేక ఇబ్బందుకు గురవుతున్నారని, వాటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టిని సారించబోతున్నట్లు వివరించారు. త్వరితగతిన ఎటువంటి విపత్తు వచ్చినా సత్వరమే పరిష్కరించే విధంగా సన్నద్దంగా ఉండాలని ఇంజనీరింగ్, జలమండలి అధికారులకు విజ్ఞప్తిచేశారు. మంగళవారం జవహర్‌నగర్ వద్ద జరుగుతున్న కచ్చానాలా నూతన పైప్‌లైన్ పనులఉన అధికారులతో కలిసి కార్పొరేటర్ పావనీ వినయకుమార్, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, జిహెచ్ఎంసి ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ఇన్‌స్పెక్టర్ మహేష్, జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, సూపర్ వైజర్ శంకర్, మల్లేష్, బిజెపి నేతలు శ్రీకాంత్, సురేశ్, నవీన్‌కుమార్, సాయికుమార్, దోనేటి సత్యం, ఆనంద్‌రావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ రథసారథి కోదండరామ్‌కు పౌరసన్మానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ జనసమితి అధ్యక్షుడు ఎం.నర్సయ్య

**చిక్కడపల్లి, సెప్టెంబరు 2ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ రథసారథి, తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా 4న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో పౌరసన్మాన ఏర్పాటు చేసినట్లు గ్రేటర్ హైదరాబాద్ జనసమితి అధ్యక్షుడు ఎం.నర్సయ్య వివరించారు. మంగళవారం ముషీరాబాద్ జనసమితి కన్వీనర్‌మెరుగు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కోదండరామ్‌కు సన్మానం అంటే తెలంగాణ సమాజానికి సన్మానం చేసినట్లుగా భావిస్తు ఈ సభను ఏర్పాటు చేయడం జరిగిందని, లోయర్‌ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ దేవాలయం నుంచి ఇందిరాపార్కు, బీమీ మైదానం, అశోక్‌నగర్, గాంధీనగర్, ఆర్టీసిక్రాస్‌రోడ్స్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సమితి గ్రేటర్ ప్రధాన కార్యదర్శి బట్టల రామ్‌చందర్, బీసీ సెల్ అధ్యక్షుడు ఎస్.జస్వంత్‌కుమార్, గాంధీనగర్, కవాడీగూడ, అడిక్‌మెట్ డివిజన్‌ల అధ్యక్షులు గుండెల్లి రవీందర్ యాదవ్, అజయ్‌గౌడ్, కె.సుధాకర్, ముషీరాబాద్ అసెంబ్లీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య, నగర ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మానేపల్లి లక్ష్మణ్, నాయకులు నగేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రోత్సవాలకు ఎంపి లక్ష్మణ్‌కు ఆహ్వానం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి గణపతి దేవాలయంలో సెప్టెంబరు 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరిగే నవరాత్రోత్స వాలకు సంబంధించిన ఆహ్వానపత్రాలను రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌కు మంగళవారం ఆలయం ఈవో లక్ష్మారెడ్డి అందించారు. ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. ఆ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నా సాయిచంద్, నేతలు జి.శ్రీకాంత్, ఐ.సురేశ్, జి.అరుణ్ కుమార్, ఆనంద్‌రావు, శివకుమార్, ఆలయం భక్తబృందం సభ్యులు రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల్లో డ్రైనేజీ కల్వకుండా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ శశాంక

**నార్సింగి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త :** చెరువులలో డ్రైనేజి నీరు కలువకుండా పకడ్బంధీ చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. సోమవారం గండిపేట మండలం మణికొండ మున్సిపల్ పరిధిలో ఉన్న నెక్నాంపూర్ చెరువును మున్సిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు కలెక్టర్‌ను కలిసి చెరువుల ఆక్రమణ, చెరువుల్లోకి వదులుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా చెరువులలోకి వచ్చే డ్రైనేజి నీటిని ఆపడం లేదని, వరద నీటి కాలువలకు అడ్డంగా భారీ భవనాలు నిర్మించారని తెలిపారు. చెరువులలో కలుస్తున్న డ్రైనేజి కారణంగా నీరంతా దుర్వాసనను వెదజల్లుతుందని, పవిత్రమైన గణపతి నిమ్మజనంను ఇక్కడే చేస్తామని, ఈ డ్రైనేజి నీటిలో వేయడం చాలా బాధగా ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు. స్థానికుల సమస్యల పట్ల స్పందించిన కలెక్టర్ శశాంక్ డ్రైనేజీ నీరు చెరువులోకి కలువకుండా, పైప్‌లైన్‌లు వేసి మూసీలోకి వదులాలని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు, స్థానిక ప్రజలంతా సమన్వయంతో పని చేసి చెరువులను సంరక్షించుకోవాలని కలెక్టర్ స్థానికులకు సూచించారు. వర్షాల వలన ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు పద్మారావ్, ఆలస్యం నవీన్, శ్రీకాంత్, రామచంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాము మధురోహలు నరసింహప్పకు అంకితం

**రవీంద్రభారతి, సెప్టెంబరు 2 ప్రభాతవార్త :** ప్రముఖ కవి. రచయిత, జవహర్ బాలభవన్ పూర్వ డైరెక్టర్ డా. ఎం.కె.రాములు రచించిన మధురోహలు కవితా సంపుటిని ఆవిష్కరించి విశ్రాంత ఇన్‌కంటాక్స్ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్పకు అంకితమివ్వనున్నట్లు ప్రముఖ సాంస్కృతిక సంస్థ రమసయి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.కోదండరాము తెలిపారు. ఈ మేరకు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సెప్టెంబరు 5 గురువారం సాయంత్రం 5.30గంటల నుండి విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ సభాధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ డా. ఎస్.రమేష్‌కుమార్ విశిష్ట అతిథులు పి.వి.సాయిబాబా, కళారత్న ఎం.కె.ఆర్.ఆశాలత, రచయిత డా. ఎం.కె.రాముతో కలిసి కవితా సంపుటి మధురోహలును ఆవిష్కరించి తొలిప్రతిని ఎం.నరసింహప్పకిచ్చి అంకితం చేస్తారని వివరించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గ్రంథ విశ్లేషణ కావిస్తారని; సభకుముందు సంగీత గురువు కె.రామాచారి నిర్వహణలో డా. ఎం.కె.రాము రచించిన గీతాల గానం వర్ధమాన గాయకులు కావిస్తారని పేర్కొన్నారు.

## బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది



వరద బాధితులకు ఆహారం అందచేస్తున్న కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్

**బేగంబజార్, సెప్టెంబర్ 2ప్రభాతవార్త:** నగరంలోని వరద భాదితులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనాఉందని జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ అన్నారు. బంగాళఖాతంలోని అల్పపీడనం మూలంగాకురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అనేక అవస్థలకు గురవుతున్నారు. డివిజన్ పరిధిలోని కట్టెలమండి, ఎగ్జిబిషన్ మైదానం ప్రాంతానికి ఆనుకుని గుడిసెల వాసులకు కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ బిజెపి నాయకులతో కలిసి వారికి అల్పాహారం, ఆహార పదార్దాలను అందచేశారు. జిహెచ్ఎంసి విభాగం అధికారులు కూడా సకాలంలోస్పందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## వినాయకచవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త :**

వినాయక చవితి ఉత్సవాలను నిర్వాహకులు, ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని వెస్ట్‌జోన్ డీసిపి విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీసు అధికారులు, జీహెచ్ఎంసీ, జలమండలి, శానిటేషన్, ఫైర్, నీటిపారుదల శాఖతో పాటు పలు విభాగాల అధికారులు, మండప నిర్వాహకులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీసిపి మాట్లాడుతూ మండప నిర్వాహకులు నిబంధనలకు లోబడి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, డీజే, లౌడ్‌స్పీకర్లకు అనుమతి లేదని సూచించారు. ఇప్పటివరకు వెస్ట్‌జోన్‌లో మండపాల ఏర్పాటుకు వెయ్యికి పైగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. చాలా సంవత్సరాల తర్వాత గ్రూప్ 1 పరీక్షకు నోటిఫికేషన్ వచ్చిన నేపథ్యంలో జిల్లాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు చదువుకోవడానికి నగరానికి వచ్చారని వారికి కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా ప్రశాంతంగా నిమజ్జనం రోజున వాహనాలను ముందుకు తీసుకెళ్ళేలా ప్రణాళికలు సిద్దం చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులున్నారని అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తారని అన్నారు. ఈకార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, డీసిలు ప్రశాంతి, రజినీకాంత్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి హరిప్రసాద్, ఏసిపిలు వెంకటరెడ్డి, మోహన్‌కుమార్, సీఐలు వెంకటేశ్వర్‌రెడ్డి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఏఐపై మరింత అవగాహన అవసరం

### -ఐటీశాఖ సెక్రటరీ జయేష్‌రంజన్

**హైదరాబాద్, సెప్టెంబరు 2,ప్రభాతవార్త:**

ప్రస్తుతం సమాజంలో ఏఐవిస్త్రతంగా వ్యాపించి ఉందని కానీ దానిపై సామాన్యులకు ,విద్యార్థులకు మరింత అవగాహన అవసరమని తెలంగాణ ఐటీ సెక్రటరీ జయేష్‌రంజన్ అన్నారు. తెలంగాణలో యువతకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై ఆన్లైన్‌లో ఉచిత శిక్షణ అందించేందుకు టాస్క్‌తో మాటా ఒప్పందం కుదుర్చుకోవడం అభినందనీయమన్నారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్ టాస్క్ కార్యాలయంలో టాస్క్ సిఈవో శ్రీకాంత్ సిన్హా, మాట ఫౌండర్ శ్రీనివాస్ జయేష్ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు. ఈసందర్భంగా జయేష్‌రంజన్ మాట్లాడుతూ ఈనెల 4,5తేదీల్లో ఏఐ సమ్మిట్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో అతిపెద్ద ఏఐసిటీని 100ఎకరాల్లో నిర్మించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని నిరుద్యోగ యువతకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఎన్ఆర్ఐ సంఘాలు ముందు రావల్సిన అవసరం ఉందని అన్నారు. మాటఫౌండర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వారానికి4క్లాసులు రోజుకు రెండు గంటలు విద్యార్థులకు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. మొదటగా ఈకార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లాలో ప్రారంభించనున్నామని దీనికి 200లకు పైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. భవిష్యత్‌లో మాట ఆధ్వర్యంలో పలుసేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయేష్‌రంజన్, శ్రీకాంత్ సిన్హా, శ్రీనివాస్ తదితరులు

## సమాజ హితాన్ని కోరుకునేదే సాహిత్యం : డాక్టర్ నాళేశ్వరం శంకరం



చందానగర్‌లోని అపర్ణ వోక్స్‌లో ఆత్మీయ కవుల సమ్మేళనంలో పాల్గొన్న తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం, తదితరులు

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 2 ప్రభాతవార్త**

సమసమాజ హితాన్ని కోరుకునేంది, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే అయుధం సాహిత్యమేనని తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం అన్నారు. కలంస్నేహం సంగీత, సాహిత్య సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గోపాల్ ఆచార్య ఆధ్వర్యంలో చందానగర్‌లోని అపర్ణ ఓక్స్‌లో కవుల ఆత్మీయ సమ్మేళం జరిగింది. ఇందులో భాగంగా కలంస్నేహం నూతన జాతీయ కమిటి కార్యవర్గ ఎన్నికతో పాటు తెలుగు భాషకు విశిష్ట సేలను అందిస్తున్న ఐదు తెలుగుసాహిత్య సంస్థల అధినేతలను ఆచార్య దేవోభవ పేరుతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా కవులకు కవిసమ్మేళనం నిర్వహించి, సాహిత్యాన్ని ప్రజా భాహుళ్యంలోనికి తీసుకువెళుతున్న కవులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రచయిల సంఘం అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ.. తెలుగు భాషపై పట్టుసాధించి కవులు ఇంకా గొప్పగా కవిత్వాన్ని వ్రాయాలన్నారు. సమాజంలో జరుగుతున్న దారుణ, మారణహోమాలతో పాటు అన్యాయాలు, అక్రమాలపై కవి ఎప్పుడు తన కలాన్ని ఝుళిపిస్తునే ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఐదు తెలుగు సాహితీ సంస్థల అధినేతలు వాల్మికి సాహితీ సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ వీ.డీ.రాజగోపాల్, తెలుగువెలుగు సాహిత్య వేధిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోటూరి నారాయణరావు, తెలుగు భాషా చైతన్య సమితి ఉపాధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ చంద్రమౌళి, రామదాసు సాంస్కృతిక, సాహితీ సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ దూత రామకోటేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. అంతకు ముందు అపర్ణ సిల్వర్ వోక్స్‌లోని చిన్నారులు వినిపించిన భగవద్గీత శ్లోకాలు, పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. అనంతరం కలంస్నేహం జాతీయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కలంస్నేహం ప్రధాన కార్యదర్శి భీమా శ్రీనివాస్‌రావు, డాక్టర్ అరవా రవీంద్రబాబు, యంవీ చంద్రశేఖర్‌రావుల నిర్వాహణా సారధ్యంలో జాతీయ ఉపాధ్యక్షులు హరిప్రియ సావిత్రి రవిదేశాయ్, రాధికా సమన్వయంతో కార్యక్రమాన్ని ఆద్యంతం రక్తికట్టించారు. ఈ కార్యక్రమంల కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంతో సీడ్స్ కంపెనీలు అవగాహన ఒప్పందం

**అత్తాపూర్ సెప్టెంబరు2,ప్రభాతవార్త :**

మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాలకు జాతీయస్థాయిలో మార్కెటింగ్ కల్పించడానికి ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కర్నూలుకు చెందిన చక్రా సీడ్స్ అలాగే సాయికృష్ణ సీడ్స్ కంపెనీలు సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి కంపెనీ ప్రతినిధులు అవగాహన పత్రాలపై సంతకాలు చేసి ఒకరికొకరు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు అలాగే, చక్ర సీడ్స్, సాయికృష్ణ సీడ్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన డిహెచ్ఎం -206 హైబ్రిడ్ మొక్కజొన్న రకానికి జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ఆయా సంస్థలు కృషి చేయనున్నాయని రిజిస్ట్రార్ డాక్టర్ రఘురాంరెడ్డి అన్నారు. అధిక దిగుబడి నిచ్చే ఈ డిహెచ్ఎం 206 హైబ్రిడ్ హెక్టారుకు 10 టన్నుల వరకు దిగుబడి రానున్నావని అన్నారు. అలాగే చార్కోల్ రాట్ తెగులను తట్టుకొని హైబ్రిడ్‌గా ఇది ప్రాచుర్యం పొందింది. జాతీయ స్థాయి ఆమోదంతో ఈ నూతన హైబ్రిడ్‌ను విశ్వవిద్యాలయం విడుదల చేసింది. ఈ హైబ్రిడ్ ఉత్తరభారత దేశంలోని పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బీహార్, ఒడిస్సా వంటి రాష్ట్రాలకు ఎంతో అనుకూలమని రిజిస్టర్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని మొక్కజొన్న పరిశోధన కేంద్రం నుంచి విడుదలైన డిహెచ్ఎం-117 ,డిహెచ్ఎం-121 వంటి హైబ్రిడ్ వండాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు గతంలో 43 సంస్థలతో అవగాహణ ఒప్పందాలు నేర్చుకోవడం జరిగింది.



## కార్బన్ న్యూట్రల్ ఎన్విరాన్‌మెంటల్ సస్టైనబుల్ రైడ్స్ ప్రారంభం


**హైదరాబాద్ సెప్టెంబరు 2 ప్రభాతవార్త:** హైదరాబాద్ మెట్రోరైల్, స్విదా మొబిలిటీ ప్రైవేట్‌లిమిటెడ్ సహకారంతన, మెట్రో షటిల్ సేవల కోసం కార్బన్ న్యూట్రల్ ఎన్విరాన్‌మెంటల్ సస్టైనబుల్ రైడ్స్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీఎస్.రెడ్డి నగరలోని హైటెక్ సిటీ మెట్రోస్టేషన్ వద్ద ఎల్ అండ్ టి మెట్రోరైల్ ఎండి కెవిబి.రెడ్డితో కలిసి ప్రారంభించారు. స్విదా పదిహేను మెట్రోస్టేషన్‌లకు 64రూట్‌లలో 150 షటిల్ బస్సులను నడుపుతోందని, రోజుకు 16వేల మంది ప్రయాణీకులకు సేవలను అందిస్తోందని, 50లక్షల మెట్రోఫీడర్ సర్వీస్ రైడ్‌లను పూర్తి చేసినందుకు స్విదా సంస్థను అభినందించారు. కార్బన్‌క్రెడిట్‌లను కొనుగోలు చేయడం ద్వారా షటిల్ రోడ్ ట్రిప్స్ కార్బన్ ఉద్గారాలను తటస్థీకరించేందుకు స్విదా చేపట్టిన చొరవ అభినందనీయమని, హైదరాబాద్ మెట్రోరైల్ పూర్తి సమగ్ర పర్యావరణ అనుకూలమైన ఇమేజ్‌ను మరింత మెరుగుపరుస్తుందని వివరించారు. మాతృభూమిని కాపాడి, మన భావితరాలకు నివాసయోగ్యమైన స్థలాన్ని వదిలివేయాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తూ, ఇతర కార్పొరేట్ సంస్థలు తమ ఈసీజీ(పర్యావరణ, సామాజిక)ను మెరుగుపరుచుకోవడానికి కార్బన్ క్రెడిట్‌ల కొనుగోలు స్పాన్సర్‌షిప్ కోసం ఎల్అండ్‌టిఎంఆర్‌హెచ్ఎల్ లేదా స్విదాతో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం కోసం క్లైమేట్ టెక్ సంస్థ టెర్రాబ్లూ క్రైమేట్ టెక్నాలజీస్‌తో స్విదా ఒప్పందం కుదుర్చుకుందని, ఆర్ఎంజెడ్, స్కైపార్క్, బోష్, బ్రిస్టల్ మైర్స్ స్కిబ్, సిబిఆర్ఇ, ఫోనిక్స్ అవాన్స్ ఐటి పార్క్, టిటిఇసీ డిజిటల్ వైబ్రాంట్ ఎనర్జికి సస్టైనబిలిటీ సర్టిఫికేట్‌లు అందచేయడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా ఇరువురు ఎండి బీల్ఈజీ ద్వారా టికెట్ బుకింగ్ సేవలను ప్రారంభించారు. కెవిబి.రెడ్డి మాట్లాడుతూ వాట్సాప్ బుకింగ్ సదుపాయం వల్ల మెట్రో ప్రయాణీకులు రూట్‌లను కనుగొనే అవకాశం ఉంటుందని, మెట్రో షటిల్‌లలో వారి ప్రయణానికి టికెట్‌లను సులభంగా బుక్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్విదా మొబిలిటీ సంస్థ సీఈవో సిదార్థ్ రవి, సహవ్యవస్థాపకుడు జిగ్నేష్ బి.బెల్లాని, హెచ్ఎంఆర్ఎల్, ఎల్ అండ్‌టి ఎంఆర్‌హెల్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

## చిరస్థాయిగా శ్రీకాకుళం గిరిజన పోరాట సిద్ధాంత గ్రంథం

**హైదరాబాద్, సెప్టెంబరు 2,ప్రభాతవార్త:**

తెలుగు సాహిత్య పరిశోధకులు డాక్టర్ కె.ముత్యం శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటంపై రాసిన సిద్దాంత గ్రంథం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పలువురు వక్తలు కొనియాడారు. దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు ఆనాడు రాసిన తెలంగాణ సాయుధపోరాట పుస్తకం ఏవిధంగా చరిత్రలో నిలిచిందో శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట గ్రంథం కూడా అంతే స్థాయిలో చరిత్రలో నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఈమేరకు నారాయణగూడలోని భారత్ విద్యాసంస్థల ఆడిటోరియంలో తెలుగు సాహిత్య పరిశోధకుడు డాక్టర్ కె.ముత్యం సంస్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యంపై రాసిన పరిశోధన ముత్యం, మట్టిమనుసుల కంటే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి, భారత్ విద్యాసంస్థ వ్యవస్థాపకులు సిహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శివారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు నందిని సిద్దారెడ్డి, జూలూరు గౌరీశంకర్, ప్రముఖ సాహితీవేత్త నాగేశ్వరం, బండ్ల మాధవరావు, శంకర్, ప్రొ.వినాయకరెడ్డి, తులా రాజేందర్, సాధినేని వెంకటేశ్వరరావు, పోటు రంగారావు, కుటుంబ సభ్యులు అపర్ణ, ప్రత్యూష, వసంత్, గుల్మొహర్ కాలనీ ప్రెసిడెంట్ కాశీం, మాజీ సీటీవో అన్వర్‌పాషా, ముత్యం శిష్యులు రమేష్, అక్బర్, విజయ్, చైతన్య, జెఎన్‌టియూ మాజీ రిజిస్ట్రార్ విజయ్ కుమార్, ప్రొఫెసర్ తింబాద్రి తదితరులు పాల్గొన్నారు.




డాక్టర్ ముత్యం రాసిని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పటోళ్ల శశిధర్‌రెడ్డి, శివారెడ్డి, వినాయక్‌రెడ్డి, సూర ప్రభాకర్‌రెడ్డి, సిహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, తుల రాజేందర్ తదితరులు

## వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



**అత్తాపూర్ సెప్టెంబరు2,ప్రభాతవార్త :**

సీజనల్ వ్యాధుల భారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిసి రవి కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హనుమాన్ నగర్‌లో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదు కావడంతో రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవి కుమార్ ఆ ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా దోమల పెంపకం మూలాల నియంత్రణ, నివారణ చర్యల కోసం చేపట్టివల్సిన పలు సూచనలు చేశారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని వ్యాధుల భారినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ ఎస్ఈ, ఎఈ ఎంటమాలజీ, సిహెచ్ఓ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

రాజేంద్రనగర్ సర్కిల్‌లోని పత్తికుంట చెరువును డిసి రవి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జనానికి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## ఘనంగా పోలాల అమావాస్య వేడుకలు



**ఉప్పల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

ఉప్పల్ నల్లపోచమ్మ ఆలయంలో పొలాల అమావాస్య వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉప్పల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన పొలాల అమావాస్య సందర్భంగా ఉప్పల్ నల్లపోచమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ప్రతి ఏటా ఘనంగా పొలాల అమావాస్య వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్య వైశ్యుల అన్నదాన కార్యక్రమానికి ఆర్యవైశ్య బంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బిక్కుమల్ల సుధాకర్ గుప్త, ప్రధాన కార్యదర్శి నూకల ప్రభాకర్ గుప్త, సంఘం సభ్యులు బిక్కు మల్ల రమేష్ బిక్కుమల్ల అంజయ్య గుప్తా, బిక్కుమల్ల రవి,రేణిగుంట్ల కిరణ్ కుమార్, బిక్కుమల్ల సంతోష్, బిక్కు మల్ల దయాకర్, బెజవాడ చంద్ర ప్రకాష్, పెద్ది రమేష్, మనసాని హరిప్రసాద్, కాసం సంతోష్ గుప్తా, గౌరీశెట్టి శ్రీనివాస్, తేనుకుంట్ల ప్రవీణ్, పాలడుగు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు పండ్ల పంపిణీ



**నేరేడ్‌మెట్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 15 వర్థంతిని పురస్కరించుకొని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగిందని వైయస్సార్సీపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా పేర్కొన్నారు. అనంతరం నేరేడ్‌మెంట్‌లోని అరుణోదయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు వాటర్ బాటిల్స్, పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పేద ప్రజల సంక్షేమం అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాల ప్రవేశపెట్టి ప్రజా రంజక పాలన అందించారని గుర్తు చేశారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసి రైతులకు ఉచిత కరెంటు ఆరోగ్యశ్రీ ద్వారా పెద ప్రజలకు మెరుగైన వైద్యం, బీద పిల్లలకు ఉచిత ఫీజు రియంబర్స్మెంట్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 86 ప్రాజెక్టులు ప్రారంభించిన అపర భగీరథునిగా ఎన్నో కార్యక్రమాలు చేసిన దివంగత మహానేత మన మధ్య దూరమై 15 సంవత్సరాలు కావస్తున్న ప్రజల గుండెల్లో చిరస్థాయిగా సజీవంగా నిలిచి ఉన్నారని అన్నారు.

## వైయస్సార్ సేవలు ఎనలేనివి



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకుడు, జి ఎన్ వి సతీష్ కుమార్ అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు ఆనంద్ బాగ్ క్యాంప్ కార్యాలయంలో వైయస్సార్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. నేటి యువత వైయస్సార్ ఆశలను అలవర్చుకొని పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడాలన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టల శ్రీనివాస్ జీడి సంపత్ గౌడ్ ప్రవీణ్ వినోద్ సంతోష్ పిట్టల నాగరాజు రామచందర్ బాలరాజు యాదవ్ కన్నా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల హృదయాల్లో చిరస్మరణీయుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి




**సైదాబాద్, సెప్టెంబరు 2 (ప్రభాతవార్త) :**

మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కర్మన్ ఘాట్ లోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. దివంగత రాజశేఖరరెడ్డి తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులుగా మిగిలిపోయారని అన్నారు. పేద ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న గొప్ప నాయకుడని కొనియాడారు. నేటితరం నాయకులందరికీ దివంగత రాజశేఖర్ రెడ్డి ఆదర్శప్రాయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అమావాస్య సందర్భంగా అన్నదానం

**ఎల్బీనగర్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

కొత్తపేట డివిజన్ మోహన్ నగర్ లో శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పాల్గొనీ ప్రజలకు భోజనం వడ్డించారు. అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులను కార్పొరేటర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచి రాజేష్, సుందర్ నారాయణ, రింకు గౌర్, ఉపేందర్ సింగ్, ప్రవీణ్ తాత తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలతో రోడ్లు అస్తవ్యస్తం







**హయత్‌నగర్, సెప్టెంబర్ 2 (ప్రభాత వార్త) :**

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం సోమవారం ఒకింత తగముఖం పట్టింది. వర్షాలకు గుంతల మయంగా మారిన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోడ్లపై గుంతలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. గుంతలమయంగా మారిన రోడ్లకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాల్సిన అవసరం ఉంది. వనస్థలిపురం ప్రాంత కాలనీల నుంచి వచ్చి చేరిన వరద నీటితో కుమ్మరి కుంట చెరువు నిండికుండల మారింది. చెరువు అలుగు వద్ద గుర్రపు డెక్క భారీగా చేరింది. దాన్ని తొలగించి వరద నీటిని బాతుల చెరువు లోకి సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక జాతీయ రహదారి విస్తరణలో అడుగడుగునా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కన్పిస్తోంది. సర్వీస్ రోడ్ల పక్కన వరద నీరు వెళ్లేందుకు నిర్మిస్తున్న కాలువలు పూర్తి కాక పోవడంతో వరద నీరు రోడ్లమీద నిలుస్తోంది. దీనికి తోడు వరదనీటి కాలువల పక్కన మట్టి కుప్పలను తొలగించక పోవడంతో వాహనదారుల ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయి. పెద్ద అంబర్ పేట జేసీబీ జంక్షన్ సమీపంలో ఆసుపత్రి ముందు హైటెన్షన్ స్తంభం కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్తంభాన్ని వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**హయత్‌నగర్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

హయత్ నగర్ లోని హయత్ నగర్ పబ్లిక్ స్కూల్లో 2009-10 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం హయత్ నగర్ లోని ఫంక్షన్ హాల్ లో ఆనందంగా జరుపుకున్నారు. ఎక్కడెక్కడో వివిధ ప్రాంతాల్లో, వివిధ హెూదాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకచోట చేరుకొని గత అనుభవాలు,జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నామన్నారు. 14 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు రోజంతా ఆటపాటలతో ఎంతో సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా కేకును కోశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పారంద సాయి ప్రసాద్, సద్దిపెల్లి శివారెడ్డి, అంతటి భారత్, మాధురి, చైత్యన ముదిరాజ్, విజయ్ గౌడ్, సంఘీ మౌనిక,శిరీష పాల్గొన్నారు.



## వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**తుర్కయాంజాల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపల్ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని అబ్దుల్లాపూర్మెట్ మండల్ ఎమ్మార్వో సుదర్శన్‌రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి పేర్కొన్నారు. తుర్కయంజాల్ మాసబ్ చెరువు అలుగు పారుతున్న కాలువను డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల ముందు పరిశీలించారు. ప్రజలు కాలనీవాసులు ఇబ్బందులు పడకూడదని వెంటనే అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న నీటిని మున్సిపాలిటీ సిబ్బందితో తీసివేయించారు. మున్సిపాలిటీ పరిధిలోని నాలాలో పేరుకపోయినా చెత్త చెదారాన్ని కూడా క్లీన్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎలాంటి నమస్యలు తలెత్తినా తమ దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, ప్రవీణ్ కుమార్, హరీష్, వివిధ శాఖల అధికారులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆలయంలో అమావాస్య పూజలు

**ఉప్పల్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

ఉప్పల్ శ్రీ శివశంకర మహామ్మాయి దేవాలయంలో శ్రావణ మాస అమావాస్య సందర్భంగా శ్రీ మహామ్మాయి దేవి ప్రత్యేక అలంకరణ మరియు అన్న ప్రసాద వితరణ జరిగింది. శివశంకర మహమ్మాయి ఆలయంలో ప్రతి అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నేతలు యు బల్వంతచారి తెలిపారు ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సభ్యులు ఉప్పోజి బలవంత చారి,రాజు గోపాల్ చారి,పల్లెర్ల గోపి,చోల్లెటి బ్రహ్మ చారి,శ్రీనివాస్,శ్రీధర్, గౌతమ్,శమిర్ పేట హనుమంత రెడ్డి,మందుముల అంజిరెడ్డి, గుజ్జుల నర్సింహ రెడ్డి,మమిడ్ల బాల్ రాజు, సురేష్,నర్సింహ చారి,మహేష్ చారి,ప్రకాశ్,గడ్డం పాపి రెడ్డి,అనిల్ రెడ్డి,రాం ప్రకాష్,రాజు,తురయి దాస్,మహేష్,రమేష్ చారి,గుముడెల్లి క్రిష్ణ,సంతోష్,సాయి,నర్సింగ్ రావు,మల్లేశ్,సుత్తి రెడ్డి,పాపయ్య గౌడ్,శివ కుమార్,ముదిగొండ రావి, అంజిరెడ్డి,కృష్ణ,చారి,శ్రీనివాస్ రావు, బాల్ రాజు, కృష్ణ,మొహన్,క్రిష్ణ రెడ్డి,పసుపు నెటి రమేష్,పవన్ కుమార్,వెంకటేశ్, భవాని శంకర్, సాయిరాం,సంతోష్, తదితర భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



## బ్యాడ్మింటన్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడుగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**ఎల్బీనగర్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడుగా టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తను నియమిస్తూ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఉప్పల శ్రీనివాస్ గుప్తతో పాటు ఉపాధ్యక్షులుగా పునటి శ్రీకాంత్, నరేందర్ స్వామి, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ భాస్కర్, జాయింట్ కార్యదర్శులుగా పిల్లలమర్రి రమేశ్, నాగరాజు, కోశాధికారిగా హర్ష యాదవ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా షేక్ రేష్మ, వేణుకుమార్, సీతల్ మోహందాస్ లను నియమించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లేల గోపీచంద్, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాకు ఒక స్టేడియం ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని, క్రీడలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారని అన్నారు.



## గణేష్ నవరాత్రులకు విస్తృత ఏర్పాట్లు : ఉప కమిషనర్

**ఎల్బీనగర్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

గణేష్ నవరాత్రులకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేయడంలో జిహెచ్ఎంసి నిమగ్నం అయిందని సరూర్ నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత తెలిపారు. సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయంలో పలు విభాగాల అధికారులు, కార్పొరేటర్లు, భాగ్య నగర్ ఉత్సవ సమితి సభ్యులతో వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. గణపతి విగ్రహం నిమజ్జన సమయంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా రోడ్లకు మరమ్మత్తులు నిర్వహించాలని, చెట్ల కొమ్మలను ట్రిమ్మింగ్ చేయించాలని, వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సుజాత ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు పవన్ కుమార్ నాయికోటి, రంగ నర్సింహా రావు, ఈఈ కే.శ్రీనివాస్, ఏసిపి ప్రతాప్, చందన, సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు నీట మునగక పోవడంతో హర్షం

**వనస్థలిపురం, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

గత కొన్ని సంవత్సరాలుగా భారీ వర్షాలకు ముంపునకు గురవుతున్న వనస్థలిపురం డివిజన్ లోని క్రిస్టియన్ కాలనీ నాగార్జున కాలనీ, జనప్రియ హెూమ్స్, అభ్యుదయ నగర్ తదితర కాలనీలు గత 3 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునగక పోవడంతో హర్షం వ్యక్తం చేశారు. సోమవారం క్రిస్టియన్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఎగువనుండి వస్తున్న వర్షపునీరు దిగువన ఉన్న కాలనీలలోకి రావడంతో కాలనీలు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు వివరించి యుద్ధ ప్రాధికతన వర్షపునీరు వెళ్ళడానికి పైప్ లైన్ లను వేయించడం జరిగిందన్నారు. తద్వారా కాలనీలు నీట మునగలేదన్నారు. అదేవిధంగా త్వరలో సిమెంట్ రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చేపట్టిన హైడ్రా కార్యక్రమంతో ప్రజలు హర్షిస్తున్నారన్నారు. డివిజన్ లో ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు



## గ్రాప్ లింగ్ పోటీలలో పథకాలు సాధించిన విద్యార్థులు : కోచ్ ఆదిమూల కృష్ణ



**మలక్‌పేట్, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

నగరంలో నిర్వహించిన గ్రాప్ లింగ్ పోటీలలో మలక్‌పేటకు చెందిన విద్యార్థులు బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించి తమ సత్తా చాటారని కోచ్ ఆదిమూల కృష్ణ పేర్కొన్నారు. పవర్ సంక్బురీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాప్ లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో నింబోలి అడ్డలోని రా కంబ్యాక్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు దేవాన్ష్,అజయ్, విగ్నేష్ లు బంగారు పతకాలు సాధించగా, జయంత్ రజత పతకం, విశాల్, దక్షు,అంకిత్, హర్ష, కృష్ణలు కాంస్య పతకాలు సాధించారని కోచ్ ఆదిమూల కృష్ణ వివరించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం కోచ్ ఆదిమూల కృష్ణ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ లో నూతనంగా చేర్చిన గ్రాప్ లింగ్ క్రీడలకు మంచి ఆదరణ లభిస్తోందని, విద్యార్థులు గ్రాప్ లింగ్ క్రీడలపై ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. గ్రాప్ లింగ్ క్రీడలు ఒక రకమైన కుస్తీ పోటీ మాదిరిగా ఉంటుందని వివరించారు. ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు.

## ప్రశాంతంగా మిలాద్ ఉన్ నబి ప్రదర్శనలు : హాఫిజ్ ముజఫర్



**మలక్‌పేట, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

మిలాద్ ఉన్ నబి ప్రదర్శనలను ఈనెల 19వ తేదీన ప్రశాంతంగా నిర్వహించనున్నట్లు మర్కాజి మిలాద్ జులుస్ కమిటీ ప్రతినిధులు హాఫిజ్ ముజఫర్ తదితరులు పేర్కొన్నారు. మర్కాజి మిలద్ జూలూస్ కమిటీ ప్రతినిధుల బృందం నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన ప్రదర్శనలు నిర్వహించడానికి అనుమతిని ఇవ్వాలని కోరుతూ నగర పోలీస్ కమిషనర్ కి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవడం కోసం పూర్తిస్థాయిలో తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని నగర పోలీస్ కమిషనర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, సౌత్ జోన్ డిసిపి స్నేహ మెహ్రా ,మర్కాజి మిలాద్ జులూస్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్‌కు కాంగ్రెస్ నాయకుల నివాళి

**ఎల్బీనగర్, సెప్టెంబరు 2 (ప్రభాతవార్త) :**

ఆర్కేపురం డివిజన్ చిత్రా లేవుట్ లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వైయస్సార్ విగ్రహానికి గజమాల వేసి నివాళుర్పించారు.



నిరుపేదల ప్రజల కోసం వైయస్సార్ నిరంతరం పరితపించారని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక ప్రజా సంక్షేమాలు ప్రవేశపెట్టిన ఘనత వైఎస్ఆర్ కే దక్కుతుందని ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తలాటి రమేష్ నేత, పెద్దవూర సైదులు, రాజు నాయక్, భాస్కర్, ప్రేమ్ నాయక్, జహంగీర్, నాను నాయక్, పెరిక అశోక్, విప్లవ్, జగదీష్, నగేష్, రవి నాయక్, రాము, భార్గవ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

**జోనల్ కమిషనర్ వెంకన్న**




**మలక్‌పేట, సెప్టెంబర్ 2 (ప్రభాతవార్త) :**

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జీ హెచ్ యం సీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో చాంద్రాయణగుట్టలోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ సర్కిల్ కి సంబందించిన ఆస్తి పన్ను, చార్మినార్ సర్కిల్ లోని అక్రమ నిర్మాణం సమస్యలపై, మొత్తం 2 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్బంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో బస్తీ, కాలనీ వాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ (యూబిడి) అమీనా బీ, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ఏయంసీ రాజారావు, ఎలక్ట్రికల్ డిఈ సత్యనారాయణరెడ్డి, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.